## నేడు జాబ్ మేళా

ఇచ్చోడ(సిరికొండ), ఏప్రిల్ 24: ఆదిలాబాద్ జిల్లా సిరికొండలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రతిమ ఫౌండేషన్, ఆర్‌ఎంపీ డాక్టర్స్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిరుద్యోగుల కోసం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆర్‌ఎంపీ సంఘం మండలాధ్యక్షుడు లక్కం మల్లేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ యువకులు శిక్షణతో పాటు ఉపాధి కల్పిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు స్టడీ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు జిరాక్స్ అందజేయాలని సూచించారు.

## ముగ్గురిపై కేసు

ఎదులాపురం, ఏప్రిల్ 24 : పశువుల వాహనాన్ని ఆపి డబ్బులు వసూలు చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు మావల ఎస్ఐ విష్ణు వర్ధన్ తెలిపారు. బుధవారం రాత్రి మావల బైపాస్ సమీపంలో కారులో ముగ్గురు వ్యక్తులు పశువులతో వెళ్తున్న వాహనాన్ని ఆపి వేసి రూ.20 వేలు ఇస్తే వాహనాన్ని వదిలేస్తామని లేదంటే పోలీసులకు పట్టిస్తామని బెదిరించారు. దీంతో వాహన డ్రైవర్ రూ.20 వేలు ఇచ్చేశాడు. ఓ వ్యక్తి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. శ్రీరామ్ కాలనీకి చెందిన సుధీర్, ఖుర్షీద్ నగర్‌కు చెందిన జవీద్, సుందరయ్య నగర్‌కు చెందిన సయ్యద్ మోసిన్ వసూలు చేసిన డబ్బును పంచుకున్నారు. జవీద్, సయ్యద్ మోసిన్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఫరరీలో ఉన్న సుధీర్ కోసం గాలింపు చర్యలు చేపట్టామన్నారు.

## జాన్సన్ నాయక్ పూజలు



పూజలు చేస్తున్న బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భుక్యా జాన్సన్ నాయక్

ఖానాపూర్ రూరల్, ఏప్రిల్ 24: ఖానాపూర్ మండలంలోని తర్లపాడు ఓంకారేశ్వర ఆలయ వార్షికోత్సవంలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భుక్యా జాన్సన్ నాయక్ పాల్గొన్నారు. ఆలయంలో జరుగుతున్న ఉత్సవాల్లో పలు అబిషేకములు చేసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గంగారాజం, నర్సయ్య, రాజేందర్, మహేశ్, బీరయ్య, మల్లేశ్ పాల్గొన్నారు.

## గిరిజనేతరుల భూముల సమస్యలు పరిష్కరించాలి

ఉట్నూర్, ఏప్రిల్ 24 : ఏజెన్సీలోని గిరిజనేతర భూముల సమస్యలను భూ భారతి ద్వారా పరిష్కరించాలని దళిత జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కాంబ్లే ప్రజ్ఞశీల్ అన్నారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లోని కుమ్రం భీం ప్రాంగణంలో కలెక్టర్ రాజర్షిషాకు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్‌కు వినతి పత్రం సమర్పించారు. ఇక్కడ జిల్లా అధ్యక్షుడు జాడి వెంకటేశ్ ఉన్నారు.

## సోషల్ వెల్ఫేర్ కళాశాలలో విజయకేతనం

ఎదులాపురం, ఏప్రిల్ 24: ఆదిలాబాద్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల సీవోఈలో ఇంటర్మీడియట్ ఫలితాల్లో విద్యార్థినులు విజయకేతనం మోగించినట్లు ప్రిన్సిపాల్ లలిత కుమారి తెలిపారు. ప్రథమ సంవత్సరం బైపీసీలో 36 మంది బాలికలు పరీక్ష రాయగా అందరూ పాసయ్యారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో 34 మందికి 31 మంది ఉత్తీర్ణులై 91 శాతం ఫలితాలు సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో 33 మంది బాలికలకు 32 మంది ఉత్తీర్ణులై 97 శాతం, బైపీసీలో 34 మందికి 33 మంది ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణులైన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

## ఆదిలాబాద్ కలెక్టర్‌కు సన్మానం

ఎదులాపురం, ఏప్రిల్ 24: ఇటీవల సివిల్ సర్వీసెస్ డే సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా అవార్డు అందుకున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షాను జిల్లా అధికారులు క్యాంపు కార్యాలయంలో గురువారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, జడ్పీ సీఈవో జితేందర్ రెడ్డి, డీఆర్డీవో రవీందర్, డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్, రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్, మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, డీబీసీడీవో రాజలింగు, డీఎండబ్ల్యూవో మనోహర్, డీపీఆర్ తిరుమల పాల్గొన్నారు.

### తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

ప్రధానమంత్రి ప్రజాస్వామ్య ఉత్తమ పురస్కారానికి ఎంపికై ప్రధాని మోదీ చేతుల మీదుగా అవార్డు అందుకున్న కలెక్టర్ రాజర్షి షాను తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా సంఘం తరపున అధ్యక్షుడు శివకుమార్, కార్యవర్గ సభ్యులు శాలువాతో సన్మానించారు. జిల్లా అధికారుల అందరి కృషితోనే జిల్లాకు ప్రత్యేక గుర్తింపు లభించిందని కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ రాజేశ్, జాయింట్ సెక్రటరీ అనిల్, ట్రెజరర్ శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## యూజీఎస్, నీట్ పరీక్షపై సమావేశం

ఎదులాపురం, ఏప్రిల్ 24: యూజీఎస్, నీట్ పరీక్షపై గురువారం ఆదిలాబాద్ కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజర్షి షా అదనపు కలెక్టర్ శ్యామలాదేవితో కలిసి విద్యా, వైద్య శాఖ, సంబంధిత అధికారులు, ప్రిన్సిపాల్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మే 4వ తేదీన మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగనున్న నీట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, నిరంతర విద్యుత్, శానిటేషన్, బెంచీలు, బస్ సౌకర్యం ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. ఈ నెల 30లోగా అన్ని పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, కేంద్రియ విద్యాలయ ప్రిన్సిపాల్ అశోక్, డీఈవో, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమిపూజ

ఉట్నూర్ రూరల్, ఏప్రిల్ 24: ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోని సుద్దగూడ గ్రామంలో మొదటి విడుతలో మంజూరైన 39 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మర్సుకోల తిరుపతి, ఆర్టీఏ సభ్యుడు రాజేశ్వర్ పాల్గొన్నారు.

## రసాయనాలు వాడొద్దు

ఉట్నూర్, ఏప్రిల్ 24: పండ్లను మాగపెట్టేందుకు రసాయనాలు వాడొద్దని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. ఉట్నూర్‌లోని ఐబీ చౌరస్తాలో ఆదివాసీ ఆర్గానిక్ మామిడి పండ్ల స్టోర్‌ను ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తాతో కలిసి ప్రారంభించారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ముథోల్, ఏప్రిల్ 24 : నిర్మల్ జిల్లా ముథోల్ మండలం బోరిగాం గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఎమ్మెల్యే రామారావు పటేల్ ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతల పరిరక్షణకే కార్డన్ సెర్చ్

భైంసా, ఏప్రిల్ 24 : శాంతి భద్రతల పరిరక్షణకే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని ఏఎస్పీ అవినాశ్ కుమార్ అన్నారు. గురువారం నిర్మల్ జిల్లా భైంసాలోని ఏపీ నగర్, సంబాజీ చౌక్ ఏరియాలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని 66 ద్విచక్రవాహనాలు, 3 ఆటోలు సీజ్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ సీఐ గోపీనాథ్, ఎస్ఐలు పాల్గొన్నారు.


# రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 24: వరంగల్ జిల్లా ఎల్కతుర్తి శివారులో ఈ నెల 27వ తేదీన నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని పార్టీ మండలాధ్యక్షుడు మారుతిపటేల్‌డోంగ్రే పిలుపునిచ్చారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలోని మారుతిపటేల్ డోంగ్రే కాంప్లెక్స్‌లో చలో వరంగల్ బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ రజతోత్సవ సభకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి కార్యకర్తలు, నాయకులతో పాటు ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు మహ్మద్ అబ్దుల్ అమ్జద్, జిలానీబేగ్, మడావి భీంరావ్, షేక్ సుపియాన్, జాదవ్ ప్రకాశ్, శివాజీ, ధరణి ధన్‌రాజ్, స్వామి, సాయిలు, బాల్‌సింగ్ పాల్గొన్నారు.



ఇంద్రవెల్లి: పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బోథ్, ఏప్రిల్ 24 : వరంగల్ జిల్లాలో ఈ నెల 27వ తేదీన నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని చింతల్‌బోరి గ్రామంలో వరంగల్ బహిరంగ సభకు సంబంధించిన వాల్ రైటింగ్ రాశారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.




బోథ్: చింతల్‌బోరిలో వాల్‌రైటింగ్ రాస్తున్న బీఆర్ఎస్ నాయకులు

### ఎమ్మెల్యేను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

భీంపూర్, ఏప్రిల్ 24 : బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌ను భీంపూర్ మండల బీఆర్ఎస్ నాయకులు గురువారం కలిశారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభ నేపథ్యంలో ఎమ్మెల్యే శ్రేణులకు సూచనలు చేశారు. కలిసిన వారిలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ మేకల నాగయ్య, మాజీ జడ్పీటీసీ కుమ్ర సుధాకర్, నాయకులు జీ నరేందర్ యాదవ్, మార్సెట్టి అనిల్, ఎం కల్చాప్‌యాదవ్, గోప మహేందర్, షేక్ అఫ్రోజ్ ఉన్నారు.

## అనుమతి లేకుండా ఇంట్లో సోదాలు చేయడం సరికాదు



మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్మన్ రాథోడ్ జనార్దన్

నార్నూర్, ఏప్రిల్ 24 : వడ్డీ వ్యాపారం పేరుతో సమాచారం ఇవ్వకుండా పోలీసులు ఇంట్లో సోదాలు చేయడం సరికాదని జడ్పీ మాజీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్‌లోని సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ భవనంలో బంజారా పెద్దలు, బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక సేవలతో పాటు బీఆర్ఎస్ పార్టీలో కీలక పాత్రను పోషిస్తూ నార్నూర్ సహకార సంఘం చైర్మన్‌గా ఆడే సురేశ్ సేవలు అందిస్తున్నారని, వడ్డీ వ్యా పారం పేరుతో సమాచారం ఇవ్వకుండా ఇంట్లో పోలీసులు సోదాలు చేయడం సరికాదన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులను కావాలని భయభ్రాంతులకు గురి చేయడం సమజసం కాదన్నారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌లో నార్నూర్ సబ్ ఇన్‌స్పెక్టర్ రహీంపాషాకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అఖిల భారతీయ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు జాదవ్‌రెడ్డి నాయక్, న్యాయవాది బానోత్ జగన్, యశ్వంత్‌రావ్, అశోక్, పరమేశ్వర్, మహేందర్, దిగంబర్, రాజునాయక్, కైలాష్, గ్రామపెద్దలు, లంబాడీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## చెక్ బౌన్స్ కేసులను రాజీ పద్ధతుల్లో పరిష్కరించుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీవాణి

నిర్మల్ చైన్‌గేట్, ఏప్రిల్ 24 : చెక్ బౌన్స్ కేసులను రాజీ పద్ధతుల్లో పరిష్కరించుకోవాలని నిర్మల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీవాణి అన్నారు. గురువారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి బ్యాంకు అధికారులతో చెక్‌బౌన్స్ కేసుల పరిష్కారంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని బ్యాంకులు, చిట్‌ఫండ్స్‌లో నమోదై పెండింగ్‌లో ఉన్న చెక్ బౌన్స్ కేసులను పరస్పర రాజీమార్గాన పరిష్కరించుకోవాలని సూచించారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్‌గోపాల్, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

## హమాలీ పని చేసేందుకు అవకాశం కల్పించాలి



ఆందోళన చేస్తున్న కూలీలు

బోథ్, ఏప్రిల్ 24 : ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని ధన్నూర్(బీ) గ్రామానికి చెందిన పలువురు కూలీలు గురువారం ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ధన్నూర్(బీ) గ్రామంలో చేపడుతున్న జొన్న కొనుగోళ్లలో హమాలీ పని చేసేందుకు తమకు అవకాశం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. కేవలం బీహార్ రాష్ట్రానికి చెందిన కూలీలకు మాత్రమే హమాలీ పని చేయడానికి అధికారులు అవకాశం కల్పిస్తున్నారని వారు ఆరోపించారు. ధర్నాకు దిగడంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ ప్రవీణ్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి అక్కడికి చేరుకుని ఆందోళన నిర్వహిస్తున్న కూలీలతో మాట్లాడారు. పంట కొనుగోళ్లలో పని చేయడానికి అవకాశం కల్పిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళనను విరమించారు.

### పశువుల అక్రమ రవాణాను అరికట్టాలి

నార్నూర్, ఏప్రిల్ 24 : పశువుల అక్రమ రవాణాను అరికట్టాలని గాదిగూడ ఎస్ఐ నాగ్‌నాథ్ అన్నారు. పశువులను అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని ఆదిలాబాద్ జిల్లా గాదిగూడలో గురువారం పట్టుకున్నారు.నార్నూర్‌లోని గోసేవకు తరలించారు. ఇక్కడ గోసేవ వ్యవస్థాపకుడు రాంనివాస్, గజ్జు ఉన్నారు.

### విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి

నర్సాపూర్(జీ), ఏప్రిల్, 24 : నిర్మల్ జిల్లా నర్సాపూర్(జీ) మండలంలోని గొల్లమాడ గ్రామంలోని రైతు చెన్న శ్రీనివాస్‌కు చెందిన ఎద్దు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్తింగ్ వైర్‌కు తగిలి విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. ఎద్దు విలువ రూ. 50 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు. ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని రైతు కోరారు. ఘటనా స్థలాన్ని లైన్ ఇన్‌స్పెక్టర్ దేవానంద్, లైన్‌మెన్ రాజు పరిశీలించి పంచనామా నిర్వహించారు.

### ఉగ్రదాడి బాధితులకు కలెక్టర్ సంతాపం

కుంటాల, ఏప్రిల్ 24 : జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడిలో 26 మంది భారతీయులు మరణించిన సంగతి తెలిసిందే. దీనిపై నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ తన వ్యక్తిగత సామాజిక మాధ్యమ ఖాతా ఎక్స్‌లో ఈ దారుణమైన ఉగ్రవాద దాడిలో తమ ప్రియమైన వారిని కోల్పోయిన అన్ని కుటుంబాలకు సంతాపం తెలిపారు. చాలా బాధ కలిగించే, ఆలోచింపజేసే దృశ్యం. మనం బాధితులకు అండగా నిలుస్తామని స్పందించారు.

## ఉగ్రవాద దాడి అమరులకు నివాళి

ఇచ్చోడ(సిరికొండ), ఏప్రిల్ 24: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడిలో మృతి చెందిన అమరులకు ఆత్మకు శాంతి చేకూరాలని గురువారం బీఆర్ఎస్ నాయకులు నివాళులర్పించారు. ఆదిలాబాద్ జిల్లా సిరికొండలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మౌనం పాటించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిర్మల్ చైన్‌గేట్, ఏప్రిల్ 24 : పహల్గాం ఉగ్రదాడిలో అమాయకుల మృతిపై ఆమ్ ఆద్మీ పార్టీ తీవ్రంగా ఖండించింది. నిర్మల్‌లోని ట్యాంక్‌బండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి మృతులకు శ్రద్ధాంజలి ఘటించారు. తెలంగాణ రాష్ట్ర ఇన్‌ఛార్జి, కన్వీనర్ దిద్ది సుధాకర్, జిల్లా అధ్యక్షుడు సయ్యద్ హైదర్, నాయకులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద, ఏప్రిల్ 24: పహల్గాంలో హిందువులను లక్ష్యంగా చేసుకుని జరిగిన ఉగ్రదాడి బాధాకరమని, వారిని కఠినంగా శిక్షించాలని పలువురు పేర్కొన్నారు. ఉగ్రదాడిని నిరసిస్తూ బుధవారం రాత్రి నిర్మల్ జిల్లా లక్ష్మణచాందలో గ్రామస్తులు, నాయకులు కొవ్వొత్తుల ర్యాలీ తీశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఓస రాజేశ్వర్, సమ్మెట దశరథ్, రవి కిరణ్, ముత్యం, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

భైంసా, ఏప్రిల్ 24 : భైంసాలోని సీడ్స్ అండ్ ఫర్టిలైజర్స్, డీలర్స్, మైనార్టీల ఆధ్వర్యంలో గురువారం రాత్రి కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో శివకుమార్ బచ్చువార్, సంజీవ్ రెడ్డి, ఆసిఫ్, తదితరులు పాల్గొన్నారు.

### ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి

ముథోల్, ఏప్రిల్, 24 : జమ్మూకశ్మీర్‌లో పహల్గాంలో నరమేధానికి పాల్పడిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని మాజీ ఎంపీపీ ఎజాజొద్దీన్ అన్నారు. గురువారం ముథోల్‌లో మైనార్టీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఘటనకు కారకులు ఎవరైనా సరే విడిచిపెట్టద్దని పేర్కొన్నారు. తక్షణమే పట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మైనార్టీలు పాల్గొన్నారు.

### బాధిత కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలి

ఎదులాపురం, ఏప్రిల్ 24: పహల్గాంలోఉగ్రవాదుల దాడిలో మరణించిన వారి కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఉగ్రవాదాన్ని పూర్తిస్థాయిలో అరికట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ అన్నారు. గురువారం రాత్రి పార్టీ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జిల్లా కార్యాలయం నుంచి ఇందిరా ప్రియదర్శిని స్టేడియం వరకు కొవ్వొత్తులతో ర్యాలీ తీశారు. మృతులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉగ్రవాదం ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో పార్టీ ప్రజాసంఘాల నాయకులు అన్నమొల్ల కిరణ్, బొజ్జ ఆశన్న, మంజుల, సురేందర్, అగ్గిమల్ల స్వామి, నవీన్ కుమార్, మల్లయ్య, రవీందర్ పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి, ఏప్రిల్24: ఇంద్రవెల్లిలోని తెలంగాణ తల్లి చౌక్‌లో అఖిల పక్ష నాయకులు, ప్రజలు, వ్యాపారస్తులు, ప్రజాప్రతినిధులు కొవ్వొత్తుల ర్యాలీ తీశారు. కార్యక్రమంలో ఎస్ఐ సాయన్న, పీఏసీఎస్ చైర్మన్ మారుతిపటేల్‌డోంగ్రే, మాజీ జడ్పీటీసీ పుష్పలత, మాజీ ఎంపీటీసీలు జాదవ్ స్వర్ణలత, మడావి భీంరావ్, నాయకులు పాల్గొన్నారు.

## ఆత్మహత్యకు పాల్పడిన ఆటో డ్రైవర్‌పై కేసు

ఎదులాపురం, ఏప్రిల్ 24: ఆదిలాబాద్‌లోని సాత్నాల బస్టాండ్ వద్ద గురువారం ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. అంబేద్కర్ నగర్‌కు చెందిన పవార్ సిద్ధార్థకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టు చేయగా పాజిటివ్ వచ్చింది. ట్రాఫిక్ పోలీసులు దీంతో ఆటోను పక్కన పెట్టి ఎవరినైన సహాయకులను తీసుకువచ్చి ఆటోను తీసుకెళ్లాలని సూచించారు. ఆటో డ్రైవర్ ఒంటిపై డిజిల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటానని బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో ఆయనపై వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆత్మహత్య కేసుతోపాటు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు.

## బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 24: బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని నిర్మల్ నియోజకవర్గ సమన్వయకర్త రాంకిషన్ రెడ్డి అన్నారు. గురువారం నిర్మల్‌లోని బాగులవాడ కాలనీకి చెందిన మాజీ కౌన్సిలర్ మెంగ పోశెట్టి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆయనకు రాంకిషన్ రెడ్డి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఏడాదిన్నర కాంగ్రెస్ పార్టీ పాలనలో పేద ప్రజలకు ఒరిగిందేమి లేదని, అర్హులకు సంక్షేమ పథకాలు అందక ప్రజలు తీవ్ర నిరాశతో ఉన్నారని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మారుగొండ రాము పాల్గొన్నారు.



గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాంకిషన్ రెడ్డి

## జొన్నల కొనుగోళ్లు ప్రారంభం



జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

బజార్‌హత్నూర్, ఏప్రిల్ 24 : రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేసి న్యాయం చేయాలని ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. గురువారం బజార్‌హత్నూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. గ్రామాలవారీగా కేటాయించిన తేదీల్లో రైతులు కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ భోజారెడ్డి, పాక్స్ చైర్మన్ మేకల వెంకన్న, వ్యవసాయాధికారి మహమ్మద్ సొద్, సీఈవో నారాయణగౌడ్, డైరెక్టర్లు చట్ల వినిల్ పాల్గొన్నారు.

## బాసర సరస్వతీ అమ్మవారికి వినతి

బాసర, ఏప్రిల్ 24 : నిర్మల్ జిల్లా బాసర ఆర్జీయూకేటీ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల నిరసన గురువారానికి 16వ రోజుకు చేరుకుంది. తమ సేవలను క్రమబద్ధీకరించాలని కోరుతూ చేపడుతున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా గురువారం మహిళా అసిస్టెంట్ ప్రొఫెసర్లు బాసర సరస్వతీ అమ్మవారికి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో మహిళా అసిస్టెంట్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

## భూ భారతితో రైతుల సమస్యలు పరిష్కారం

లోకేశ్వరం/నర్సాపూర్ (జీ), ఏప్రిల్ 24 : భూ భారతి చట్టంతో రైతుల సమస్యలు పరిష్కారమవుతాయని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. నిర్మల్ జిల్లా లోకేశ్వరంలోని రైతు వేదికలో నర్సాపూర్(జీ) రైతు వేదికలో గురువారం రైతులకు భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. రైతులు తమ సమస్యలు తెలిపారు. వాటిని త్వరలోనే పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, ఆర్డీవో కోమల్ రెడ్డి, భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు పటేల్, తహసీల్దార్లు మోతీరాం,శ్రీనివాస్, ఎంపీడీవోలు వెంకట్, పుష్పలత, డీటీ రవీందర్ పాల్గొన్నారు.

## దిలావర్‌పూర్ గ్రామ పంచాయతీ సందర్శన

ఖానాపూర్ రూరల్, ఏప్రిల్ 24: నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని దిలావర్‌పూర్ గ్రామ పంచాయతీని గురువారం జడ్పీ సీఈవో గోవింద్ సందర్శించారు. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం గ్రామస్తుల ఆధ్వర్యంలో ఇందిరమ్మ కమిటీలకు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సునీత, ఎంపీవో రత్నకర్ రావు, కార్యదర్శి. గ్రామస్తులు పాల్గొన్నారు.

## గంజాయి సేవిస్తున్న ముగ్గురిపై కేసు

ఎదులాపురం, ఏప్రిల్ 24: ఆదిలాబాద్‌లోని ఏరోడ్రం వద్ద గురువారం గంజాయి సేవిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. అంకాపూర్ గ్రామానికి చెందిన ఉయిక దేవరావ్, దస్నాపూర్‌కు చెందిన ముండే ఉత్తమ్, ఫిల్టర్ బెడ్‌కు చెందిన కోడి శివాజీ గంజాయి సేవించినట్లు నిర్ధారణ అయింది. వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## దాల్ మిల్‌ను సందర్శించిన మహారాష్ట్ర మహిళలు

ఉట్నూర్ రూరల్, ఏప్రిల్ 24 : ఉట్నూర్ మండలంలోని నాగాపూర్ గ్రామంలోని రైతు మిత్ర దాల్‌మిల్‌ను గురువారం మహారాష్ట్రకు చెందిన మహిళా సంఘం సభ్యులు సందర్శించారు. సహకార మిత్ర సంస్థ మేనేజర్ కుంర విఠల్‌రావ్ మహిళా సంఘం సభ్యులకు దాల్‌మిల్ గురించి వివరించారు. సంఘ సభ్యుల ఆధ్వర్యంలో చిన్న పరిశ్రమల ద్వారా ఆర్థిక పురోగతి సాధించవచ్చునని తెలిపారు.

## ఇప్పలడ్డుతో ఆరోగ్యం

ఉట్నూర్, ఏప్రిల్ 24 : ఆదివాసీలు తయారు చేస్తున్న ఇప్ప లడ్డుతో శరీరానికి పౌష్టికాహారం అందుతుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. గురువారం ఉట్నూర్‌లోని కుమ్రం భీం ప్రాంగణంలో 8వ ఇప్ప పువ్వు పండుగ కార్యక్రమాన్ని ఎస్పీ అఖిల్ మహాజన్, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాతో కలిసి జ్యోతి ప్రజ్వాలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ యువరాజ్, మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయి, దుర్గు పటేల్, సహకార సంస్థ మేనేజర్ కుమ్ర విఠల్‌రావ్, ఆదివాసులు పాల్గొన్నారు.

## భార్యను హత్య చేసిన భర్త



కీర్తి (ఫైల్)

గుడిహత్నూర్, ఏప్రిల్ 24: భార్యను హత్య చేసిన భర్త ఘటన గురువారం ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్‌లో చోటు చేసుకుంది. ఇచ్చోడ సీఐ భీమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గుడిహత్నూర్‌కు చెందిన లట్పటే మారుతికి అదే గ్రామానికి చెందిన ముండె సూర్యకాంత్ కూతురు కీర్తితో 2012లో వివాహం జరిగింది. వారికి ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. మారుతి ఐదు సంవత్సరాల క్రితం డెయిరీ ఫామ్ నిర్వహించగా దాని నిర్వహణకు రూ. 8లక్షల వరకు ఖర్చు చేయడంతో అప్పులయ్యాయి. ఈ క్రమంలో ఒక వివాహితతో వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తున్నాడు. తన భర్త మరో మహిళతో అక్రమ సంబంధాన్ని కొనసాగిస్తున్నాడని గుర్తించి భార్య కీర్తి ఈ విషయమై భర్తను నిలదీయడంతో పాటు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. తను వివాహేతర సంబంధం పెట్టుకున్నా మహిళతో ఉండవచ్చన్న ఉద్దేశంతో భార్య కీర్తిని హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. కొద్ది రోజులుగా భార్య కీర్తి తల్లిదండ్రుల ఇంట్లో ఉంటుంది. మారుతి అత్త మామలు పనుల నిమిత్తం బయటకు వెళ్లడంతో ఇదే అదనుగా భావించి నీళ్లు తీసుకురావడానికి కుళాయి వద్దకు వెళ్లిన భార్యను గమనించి ఆమె మెడపై కత్తితో దాడి చేశాడు. తీవ్ర గాయాలై అపస్మారకస్థితిలో పడి పోవడంతో ఇరుగు పొరుగు వారు అంబులెన్స్‌లో ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించగా మార్గమధ్యంలో మృతి చెందింది. నిందితుని కోసం గాలిస్తున్నామని, కీర్తి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ భీమేశ్ తెలిపారు.

## గంజాయి పట్టివేత

ఇచ్చోడ, ఏప్రిల్ 24 : ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని సిరిచెల్మ గ్రామంలో గంజాయి పట్టుకున్నట్లు ఎస్ఐ తిరుపతి తెలిపారు. సిరిచెల్మ రోడ్డులోని అయ్యప్ప ఆలయానికి వెళ్లే దారిలో తనిఖీలు నిర్వహించగా ముక్రా(బీ) గ్రామానికి చెందిన జునైద్, కుడిమెట జంగును పట్టుకున్నట్లు తెలిపారు. కుడిమెత జంగు మన్కుగూడలోని తన ఇంటి వద్ద పండించిన గంజాయి మొక్కల నుంచి తీసిన గంజాయిని జునైద్‌కు అమ్ముతుండగా పట్టుకున్నామని పేర్కొన్నారు. వారి వద్ద నుండి 200 గ్రాములు గంజాయిని సీజ్ చేసి కేసు నమోదు చేసి కస్టడీకి తీసుకున్నామని తెలిపారు.

## లింగాపూర్‌లో చోరీ

కడెం, ఏప్రిల్ 24 : నిర్మల్ జిల్లా కడెం మండలంలోని లింగాపూర్ గ్రామంలో బుధవారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్ఐ కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గుగ్గిళ్ల బుచ్చన్నకు ఇద్దరి కొడుకులు. ఉపాధి నిమిత్తం ఇద్దరు దుబాయిలో ఉంటున్నారు, బుచ్చన్న చిన్న కొడుకు భార్య గుగ్గిళ్ల సరిత బుధవారం ఆమె తల్లిగారింటికి వెళ్లింది. ఆ గదికి సరిత మామ బుచ్చన్న తాళం వేసి పక్క గదిలో నిద్రిస్తున్నాడు. గురువారం తెల్లవారు జామున బుచ్చన్న భార్య లేచి చూడగా సరితకు సంబంధించిన గదికి తాళం పగలగొట్టి వస్తువులు చిందర వందరగా పడి ఉన్నాయి. ఈ విషయాన్ని కోడలు సరితకు సమాచారం అందించారు. దీంతో సరిత వచ్చి ఆమె గదితో పాటు బీరువాను చూడగా అందులో ఉన్న తులం బంగారం, 11 తులాల వెండి అపహరణకు గురైనట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

నేరడిగొండ, ఏప్రిల్ 24 : ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలోని నాగమల్యాల్ గ్రామానికి చెందిన కనక నారాయణ నేరడిగొండ నుంచి నాగమల్యాల్‌కు బైక్‌పై వెళ్తున్నాడు. అదుపుతప్పి సావర్‌గాం గ్రామ సమీపంలోని మూలమలుపు వద్ద డివైడర్‌ను ఢీ కొనడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అంబులెన్స్‌లో బోథ్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

## చికిత్స పొందుతూ ఒకరి మృతి

నర్సాపూర్(జీ), ఏప్రిల్, 24 : నిర్మల్ జిల్లా నర్సాపూర్(జీ) మండలంలోని డొంగుర్‌గాం గ్రామానికి చెందిన దనే విజయ్ (51) మోటర్లు పనిచేయడం లేదని ఈ నెల 11వ తేదీన సాయంత్రం సమయంలో జంగిపల్లి చిన్నయ్య వ్యవసాయ పొలంలో గల ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర మోటారు పైపులను చెక్ చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై అపస్మార స్థితిలోకి వెళ్లాడు. వెంటనే వారి కుటుంబ సభ్యులు నిర్మల్ ఏరియా దవాఖానకు తరలించారు. అక్కడి నుండి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాయికిరణ్ తెలిపారు.

## వేర్వేరు కారణాలతో ముగ్గురు ఆత్మహత్య

కుభీర్, ఏప్రిల్ 24: నిర్మల్ జిల్లా కుభీర్ మండలం అంతర్ని గ్రామంలోని మిషన్ భగీరథ సంపులో దూకి ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. కుభీర్ ఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎస్ సురేశ్‌కు అదే గ్రామానికి చెందిన రోజాను పెళ్లి చేసుకుని ఇల్లరికం వెళ్లాడు. ఇటీవల కాలంగా భార్య భర్తలకు తరచూగొడవ పడుతున్నారు. రోజా గొడవపడి అక్క ఇంటికి వెళ్లింది. భార్య తనను వదిలి పోయిందని సురేశ్ కలత చెంది మంగళవారం సంపులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### మద్యానికి బానిసై ..

భైంసాటౌన్, ఏప్రిల్ 24 : నిర్మల్ జిల్లా భైంసా మండలంలోని మిర్జాపూర్ గ్రామానికి చెందిన కదం ప్రకాశ్ (41) ఆర్థిక ఇబ్బందులతో కుటుంబ పోషణ భారమై మద్యానికి బానిసయ్యాడు. బుధవారం తన ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శంకర్ తెలిపారు. మృతుడికి ముగ్గురు కొడుకులు ఉన్నారు.

### పెండ్లికి ఒప్పుకోలేదని..

ఖానాపూర్ రూరల్, ఏప్రిల్24: తమ తల్లిదండ్రులు తను ప్రేమించిన వ్యక్తితో పెండ్లికి ఒప్పుకొలేదని ఓ మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ప్రొఫెషనల్ ఎస్ఐ శ్రావణి తెలిపిన వివరాల ప్రకారం.. ఖానాపూర్ మండలం కొలాంగూడ గ్రామానికి చెందిన ఆత్రం స్వప్న అదే గ్రామానికి చెందిన ఓ అబ్బాయిని ప్రేమించింది. ఈ విషయం తల్లిదండ్రుకు పలుమార్లు చెప్పిన నిరాకరించారు. తమ పత్తి చేనులో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. చికిత్స నిమిత్తం ఖానాపూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఉన్నత వైద్యం కోసం నిర్మల్ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. తండ్రి దేవరావ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ప్రొఫెషనల్ ఎస్ఐ తెలిపారు.